కథానిక

# పొద్దు తిరుగుడు పువ్వులు

యం. హీరాలాల్ రాయ్

ముకుందాపురం రాజాగారింట్లో, ఆయన కుమారుడు సంపత్కుమార్ వివాహం జరుగుతూ వున్నది. ఇంగ్లీషువాళ్ళు మన దేశాన్ని పరిపాలించే రోజుల్లో, రాజాగారు రాయ్ బహద్దరు బిరుదం కూడా పొందివున్నారు. నేటి కాంగ్రెస్ వారి హయాంలో కూడా ఆయన పేరు ప్రతిష్ఠల్లో లోపమేమీ రాలేదు. అయితే కొంత మార్పు మాత్రం జరిగింది ఆ రోజుల్లో రాజాగారు ఎప్పుడూ సూటులో వుండేవారు. కట్టుబాట్లలో కూడా ఇంగ్లీషు పద్ధతులనే అనుసరించేవారు. ఇప్పుడు ఖాదీ దుస్తులు బాహాటంగా వాడేస్తున్నారు. వారు తమ ఆహార పానీయాదులను కూడా జాతీయం చేసినారు. తమ భవన అలంకారంలో కూడా మార్పు వచ్చింది. జార్జిరాజు, లిన్‌లిత్‌గో వైస్రాయి మొదలగు ఆంగ్ల సామ్రాజ్యపు అధినేతల ఫోటోల స్థానంలో, గాంధీమహాత్ముడు, ఇంకా ఇతర ఖరీదైన కాంగ్రెస్ పెద్దల ఫోటోలు వుంచబడ్డాయి. ఆయన భవనం ముందు విక్టోరియా మహారాణి యొక్క శిలాప్రతిమ వున్న సంగతి నాకు బాగా జ్ఞాపకం. ఇప్పుడా స్థానంలో భారతమాత శిలాప్రతిమ స్థాపించబడి వుంది.

రాజాగారి భవనం సర్వాంగ సుందరంగా అలంకరించబడి వుంది. భవనానికి అన్నిమూలలా జాతీయపతాకంలోని మూడు రంగులతో, కళ్ళు మిరుమిట్లుగొల్పే విధంగా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయ్. ఎక్కడ చూచినా మూడు రంగులే కనిపిస్తున్నాయి. ఎవరిలో చూచినా కాంగ్రెస్ వాసనే వేస్తూంది. భవనంలో పర్దాలు మొదలుకొని, కనిపిస్తున్న ఆడవాళ్ళు, పనిచేస్తున్న పనిమనుషులు మూడు రంగులతో కూడుకున్న ఖాదీదుస్తుల్లో కనిపిస్తున్నారు. ఆ భవనం భారత ప్రజల పాలిటి స్వాతంత్ర్య మందిరంగా వెలిగిపోతూవుంది.

భవనంముందు మేళగాళ్ళు వాయిద్యాలతో మునిగి తేల్తూవున్నారు. వాళ్లూ అచ్చంగా కాంగ్రెస్ బట్టల్లోనే వున్నారు. అతిథులు కార్ల మీద మూడురంగుల పతాకాలు ఎగురవేస్తూ వచ్చారు. వీరికి మూడు రంగుల పూలచెండ్లు అందిస్తూ, స్వాగతంలో కూడా కాంగ్రెస్ కట్టుబాట్లకు భిన్నంగా పోలేదన్న విషయాన్ని, రాజాగారు రుజువు చేసుకున్నారు.

నేను కూడా పాకిస్తాన్ నుండి ప్రాణాలు దక్కించుకుని వచ్చిన ఒక శరణార్థినే. అయితే, నేను ఒక ప్రముఖపత్రికా విలేఖరిని కావడం మూలాన నన్నుకూడా ఆ పెళ్ళికి ఆహ్వానించారు.

సర్వాంగ సుందరంగా అలంకరించబడ్డ ఆ భవనంలోను, కేవలం సంతోషం మాత్రమే నిండి వున్న ఆ వాతావరణంలోను, ఒక అమాయకజీవి కంటికి కడివెడుగా ఏడుస్తూన్న సంగతి నాకు తెలిసింది. ఉషయే ఆ నిర్భాగ్యజీవి.

అమాయకమైన ఉష కళ్ళల్లో దుఃఖం దొర్లి వస్తూవున్నది. ఆ భవనం యొక్క మూడవ అంతస్తులో ఒకమూలన ఆమె ఏడుస్తూ వుంది. సంపత్ కుమార్ ఆమెపక్క చేరి ఏదో నచ్చ చెపుతూవున్నాడు. వాళ్ళిద్దరిమధ్య జరిగిన సంభాషణ నాజీవితంలో ఎప్పటికీ మరిచిపోలేను.

'ఈ చీరెలు, ఈ సొమ్ములు నాకవసరం లేదు. నన్ను శరణార్థుల శిబిరం నుండి ఇందుకోసమే తీసుకొచ్చావా? మా అమ్మతో నువ్వు చెప్పిన మాటలు జ్ఞాపకం లేవా? మా శిబిరంపైనున్న జాతీయ పతాకాన్ని చూపిస్తూ, 'ఈ ధర్మచక్ర పతాకం సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఉషకు కష్టాలు రానివ్వను. ఉషను నా అర్థాంగిగా చేసుకుంటాను. అని మా అమ్మకు మాట యిచ్చావు కదూ! అప్పటికే, యం. యల్. అన్నాడు: ఈ ధనవంతులని నమ్మవద్దనీ, వీళ్ళంతా ప్రొద్దుతిరుగుడు పువ్వులనీ. మా అమ్మ నీలో విశ్వాసం వుంచి నీ పరమ్

చేసింది. నేటిదాకా నీవు చేసిన ప్రతిజ్ఞని నిలుపుతా నంటూన్నావ్. కాని నేడు ఏం జరుగుతూ వున్నది? నీలో ఈమార్పు ఎలావచ్చింది? పవిత్రమైన ఈ మూడు రంగుల జండాకు అవమానం చేకూరుస్తూ వున్నావ్ ఈ జెండా క్రిందనే నన్ను అర్థాంగిగా తీసుకుంటానని ప్రతిజ్ఞ చేశావ్. నేడు తిరిగి ఈ జెండాల వేషంలోనే నీ ప్రతిజ్ఞను నిర్దాక్షిణ్యంగా కాలదన్నుతూన్నావ్. ఆనాడు నువ్వన్న మాటలు ఇంకా నా చెవుల్లో రింగుమంటూనేవున్నాయ్. ధనవంతులకు, నిర్ధనులకు మధ్యవున్న తేడాలను తొలగిస్తానని కోతలు కోశావ్. మరి నేడు ప్రేమపథంలో, ప్రతిజ్ఞా నిర్వహణంలో కఠోరమైన ఈ వెండి, బంగారాల పర్వతాలు ఎలా అడ్డొచ్చాయ్?' అంటూ ఉష ఉడికిపోతూ గర్జించింది.

సంపత్కుమార్ కళ్ళ వెంట నిప్పుల వర్షం కురిపిస్తూ అన్నాడు: 'ఉషా! మితిమీరి పోతున్నావ్! నువ్వుగాని, నీ వంశంగాని, అంతేకాదు పాకిస్థాన్ నుండి పారివచ్చిన నీ పిరికిసైన్యం అంతా పారివచ్చినా నాకేమీ భయంలేదు. ఈ పెళ్ళిలో చాలామంది మిలిటరీ ఆఫీసర్లు పాల్గొంటూ వున్నారు. నగరంలోని పోలీసు ఉద్యోగులంతా మనం ఎట్లా అంటే అట్లా చేస్తారు. ఇంకా నయం నీకు జీవితాంతం వరకూ బట్టకీ, తిండికి లోటులేకుండా పోషించడానికి సిద్ధంగావున్నాను. నాకువివిధంగానూ అడ్డంరాకు.'

ఉష చాలా నిస్పృహాయంగా ఏడ్చింది. 'నీలాంటి వాళ్ళ దృష్టిలో స్త్రీ అంటేనిర్జీవమూర్తిగా కనిపిస్తుంది. నేను ఒక మహోన్నతమైన వ్యక్తిని ప్రేమిస్తున్నానని భావించాను. కాని ఆ వ్యక్తి పట్టి నీచుడన్న సంగతి ఇప్పుడుగాని నాకు తెలిసిరాలేదు' అంది ఉష. సంపత్కుమార్ ఇంకా ఆగ్గిరాముడయాడు.

'మేము మునికుమారులం కాము అన్నమాటను అన్నట్లు చేయటానికి' అంటూ తుర్రున బయటికి వెళ్ళి గదికి తాళం వేసి వెళ్ళి పోయాడు.

నేను కూడా ఒక శరణార్థినే. అమాయకురాలు ఏడుస్తూ వున్నది. నాలో రైల్లు పరుగెత్తాయి. సంగతంతా బహిరంగంగా అందరికీ తెలిసే విధంగా చెప్పాలని అనుకున్నాను. ధర్మచక్ర పతాకం చాటుగా ఈలాంటి అవినీతి సాగడం, నాకు సహింపరానిదిగా అయిపోయింది.

పెళ్ళి మేళాలం సాగుతూనే వున్నాయి. జనసమూహం ఇంకా పెరిగి పోతూనేవున్నది. పెళ్ళికొడుకును, పెళ్ళికొడుకున్న మోటారు కారును, ఉజ్వలంగా అలంకరించారు. పెళ్ళికొడుకు మహోసంతోషంగా యౌవనపు పోకడలను ప్రకటిస్తూ ఉన్నాడు.

ఊరేగింపుకు అన్ని ప్రయత్నాలు జరిగి పోయినవి. పెళ్ళి కారుమీద రూపాయల వర్షం కురుస్తూవున్నది. మేళ తాళాలు ఉచ్చదశలో పరుగులిడుతున్నాయి. ఇంతలో అకస్మాత్తుగా భవనంయొక్క మూడో అంతస్తునుండి ఉష పెళ్ళి కారు మీద పడింది, ఉష వెంటనే ప్రాణాలు వీడింది. అంతే కాదు, ఉష శరీరం ముక్కలుముక్కలుగా పక్కలకు ఎగిరిపోయినది. పెళ్ళికారు నిండా రక్తం. పెళ్ళి కొడుకు బట్టల మీదకూడా రక్తమే. విద్యుద్దీపాల కాంతిలో ఆ అమాయకురాలి మాంసపు ముక్కలు రౌద్రాకారం ధరించి, ధగధగా లక్షల రూపాయల బంగారు సొమ్ములు, వజ్రాలకన్న మిన్నగా మెరిసిపోతున్నాయ్. ఈ భయంకర దృశ్యమంతా నా కళ్ళకు మాత్రమే కనిపించింది. కాని, రాజాగారి కళ్లకు ఈ దృశ్యాలేవీ కనిపించలేదని తెలుసుకుని నేనింకా బాధపడ్డాను.

రాజాగారు జరిగిన సంఘటనను మహా తేలిగ్గాను, గమ్మత్తుగాను తీసేశారు. రాజాగారు 'అయ్యో పాపం! ఏమాట కామాట చెప్పాలి. దాసీదంటే ఉషయే నిజమైన దాసి. దీనికి జ్వరం వస్తూవున్నది పాపం!' అన్నాడు. సంపత్ కుమార్ తండ్రి చూపించిన మార్గాన ఇంకా కాస్తదూరం వెళ్ళి 'రెండు గంటల క్రింద పాపం ఇది విపరీతమైన జ్వరంలో వున్నది. సరిగా నడవ్వకూడా లేదు. నేను చాలాసేపటి వరకూ అక్కడే వుండి, మంచంలో పడుకోబెట్టి వచ్చాను... అయితే నా వూరేగింపు చూడాలని దానికి కోరిక వుండేది. పాపం తన కోర్కెను నెరవేర్చుకోవటానికి ప్రాణబలి దానంకూడా చేసిందిగదా!...ఎంత విశ్వాసపాత్రమైన సేవకురాలు...' అన్నాడు.

పెళ్ళి ఆగలేదు. అయితే మరో కారు అలంకరించి, ఊరేగింపు చేశారు.